క్లుప్తంగా

పీఏ తల్లి మృతికి మంత్రి సురేష్ సంతాపం

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) శ్యాం ప్రకాష్ మాతృమూర్తి విమలమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె మృతికి మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. విమలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

150 మందికి వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురంలో బేస్తవారిపేట పార్వతి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్టీ హుస్సేన్ 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశాల ఎండీ నర్రా సత్యనారాయణరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

30న దర్శి మండల సర్వసభ్య సమావేశం

దర్శి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 30వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆహ్వానం అందిన ఇతర ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు.

భవిత కేంద్రాన్ని వినియోగించుకోవాలి


ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓలు

త్రిపురాంతకం: దివ్యాంగులు భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు కె.తులసిమల్లికార్జున నాయక్, టి.రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. త్రిపురాంతకంలో భవిత కేంద్రాన్ని వారు సందర్శించి ఫిజియోథెరపీని వినియోగించుకునేందుకు దివ్యాంగ చిన్నారులను తీసుకురావాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. భవిత కేంద్ర నిర్వాహకులు బాలవిజయ, అంకారావు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించాడని కేసు నమోదు

దర్శి: మద్యం సేవించి కులం పేరుతో దూషించాడని బండి వెలిగండ్ల గ్రామానికి చెందిన మక్కెన లోకయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్టా నాగార్జున అనే వ్యక్తిపై స్థానిక ఎస్సై రామకృష్ణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు కంతా వీరయ్యకు చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన సిమెంట్ దిమ్మెపై లోకయ్య కూర్చుని ఉన్నాడు. నాగార్జున అక్కడకు వచ్చి రాయి తీసుకుని లోకయ్యపై విసిరికొట్టి దిమ్మెపై కూర్చుంటావా అని కులం పేరుతో దూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బత్తాయి తోటలు పరిశీలించిన శాస్త్రవేత్త


బత్తాయి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త శివ

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యానవన శాస్త్రవేత్త ఎం.శివ సోమవారం బత్తాయి తోటలను పరిశీలించారు. మండలంలోని నాయుడుపాలెం, తమ్ములూరు గ్రామాల్లో పర్యటించి ఎండు తెగులు, బంక తెగులు, ఆకుముడత తెగుళ్లను గుర్తించారు. వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా, మేమ్‌లో వృద్ధిపరిచిన పశువుల ఎరువును 5 నుంచి పదికిలోలు వేయాలన్నారు. బైటాక్స్ మూడు గ్రాములను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు చెట్టు మొదలు వద్ద పోయాలన్నారు.

అర్హులకు కళ్ల జోళ్ల పంపిణీ


కళ్ల జోళ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ భాస్కర్ కుమార్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో అర్హులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 35 మందిని గుర్తించి వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అప్తాలమిక్ అసిస్టెంట్ కవిత, హెడ్ నర్స్ ఎలిజిబెత్ పాల్గొన్నారు.

సచివాలయాలతో మెరుగైన పాలన

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు
- రావిపాడులో సచివాలయ భవనం ప్రారంభం


రావిపాడులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టిందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని రావిపాడులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. పూజల అనంతరం ఎమ్మెల్యే శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయని, ఏ సమస్యనైనా వారి గ్రామంలోనే పరిష్కరించుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు పూర్తవుతుండటంతో సేవలు మరింత సులభతరమవుతాయని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే సచివాలయాల్లో సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. సిబ్బంది ఎల్లప్పుడు సచివాలయాల్లో అందుబాటులో ప్రజల సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ వరికుంట్ల భువనేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు 800 అర్జీలను పరిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన 5 కుట్టు మిషన్లు తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి పంపిణీ చేశారు. గిరిజనుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు మంత్రి వేయించిన రెండు డీప్‌వెల్ బోర్లను ఆయన ప్రారంభించారు. ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, సర్పంచ్ కె.హనిమీబాయి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు హనుమానాయక్, అంజయ్య పాల్గొన్నారు.

త్రిపురాంతకం: జగనన్న సురక్ష సభల్లో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందించనున్నట్లు ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని విశ్వనాథపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాలతో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించనున్నట్లు సుబ్బారెడ్డి వివరించారు. డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఈఓఆర్డీ మురళీమోహన్, సర్పంచ్ శాసం మాధవీలత, ఎంపీటీసీ గుడిమెట్ల మసలయ్య పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ రవీంద్రరెడ్డి


త్రిపురాంతకం మండలం విశ్వనాథపురంలో..

సాగు చేసిన పంటలనే నమోదు చేయాలి


మాట్లాడుతున్న బాలాజీనాయక్

దర్శి: ఈ క్రాప్‌లో సాగు చేసిన పంటలను మాత్రమే నమోదు చేయాలని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకుడు కే బాలాజీనాయక్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ఈ క్రాప్ బుకింగ్ విధివిధానాలపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా 2023 ఖరీఫ్ సీజన్‌లో నూతన జియో రిఫరెన్స్ విధానంలో ఈ క్రాప్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకుని సచివాలయం, రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు. ప్రతిరోజూ సర్వే చేసే నంబర్లు ముందురోజు రైతులకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ అధికారుల ద్వారా గ్రామాల్లో ఎంతమేర భూమి ఉంది, వ్యవసాయం, ప్లాట్లు, బంజరు భూముల వివరాలు ముందుగానే తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌తో కూడిన బృందాలు పంటపొలాన్ని సందర్శించి మాత్రమే పంట నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని దూపాడులో మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్‌లు పాల్గొనాలని కోరారు.

నేడు గానుగపెంటలో కూడా..

తర్లుపాడు: మండలంలోని గానుగపెంట సచివాలయం పరిధిలో మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీపీ భూలక్ష్మి, జెడ్పీటీసీ ఇందిర, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొంటారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షం నీరు


రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు

బేస్తవారిపేట: మండలంలోని జెన్నీవారిపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్ సమీపంలో లోతట్టుగా ఉండటం, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. చిన్నపాటి వర్షం పడినా పైవైపు నుంచి వర్షం నీరు రోడ్డుపైకి చేరుతుంది. రూ.లక్షల ఖర్చుతో నిర్మించిన తారు రోడ్డు నీరు నిల్వ ఉండటంతో ఛిద్రమయ్యే అవకాశం ఉందని, రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులకు బోధనోపకరణాల పంపిణీ


బోధనోపకరణాలు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

ముండ్లమూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ వారి సహకారంతో విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, బోధనోపకరణాలు పంపిణీ చేశారు. రోటరీ పూర్వ కార్యదర్శి పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటీ సంస్థ చైర్మన్ శ్రీరామ చంద్రమూర్తి మనుమడు నంబూరి సాయిహర్ష పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ నిర్వాహకులు పద్మావతి, సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, శ్రీనివాసరావు, లేవీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వనరుడు..గుర్రం జాషువా!


జాషువాకు నివాళులర్పిస్తున్న సేవాసమితి సభ్యులు

గిద్దలూరు రూరల్: విశ్వనరుడు గుర్రం జాషువా.. అని జాషువా సేవా సమితి అధ్యక్షుడు గుర్రం బాబూరావు అన్నారు. గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానిక పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన ఆలోచన విధానాలు కవిత్వ రూపంలో రచించిన గొప్పవ్యక్తి అని జాషువాను కొనియాడారు. అటువంటి వ్యక్తిని స్మరించుకోవడం మనం అదృష్టంగా భావించాలన్నారు. సేవా సమితి సభ్యులు విక్టర్, దానియేలు, కొమ్ముసూరి ఎలిషా, రవికుమార్, వెంకటేష్, కత్తి అనోజిరావు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి


విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ గురించి వివరిస్తున్న ప్రొఫెసర్

మార్కాపురం: విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు క్లౌడ్ కంప్యూటింగ్ ఉపయోగపడుతుందని వీహెచ్‌ఆర్ కళాశాలల చైర్మన్, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ విభాగాల హెచ్‌ఓడీలు డాక్టర్ కె.రాజశేఖర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు రికవరీ చేయాలి


మాట్లాడుతున్న ఏరియా కో ఆర్డినేటర్ అంబేడ్కర్

కొమరోలు: స్త్రీనిధి ఉన్నతిలో రుణాలు తీసుకున్న లబ్ధిదారుల నుంచి 100 శాతం రికవరీ చేయాలని గిద్దలూరు వైఎస్సార్ క్రాంతి పథం క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ ఆర్.అంబేడ్కర్ సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి ఉన్నతి రికవరీ, ఎస్‌హెచ్‌జీ, గ్రేడింగ్, జీవనోపాధుల గుర్తింపు, తదితర అంశాలపై వీఓఏలకు అవగాహన కల్పించారు. జీవనోపాధి కోసం పాదుపు మహిళలకు సబ్సిడీ లోన్‌లు ఇప్పించాలని, వాటిని వినియోగించుకునే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, ఏపీఎం పాండురంగప్రసాద్, స్త్రీనిధి మేనేజర్ రాజేశ్వరి, కార్యదర్శి బాలసిద్ధమ్మ పాల్గొన్నారు.

మణిపూర్ హింసాకాండను నిరసిస్తూ ర్యాలీ


ప్రదర్శనలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు


ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

మార్కాపురం: మణిపూర్ రాష్ట్రంలో హింసాకాండకు నిరసనగా సోమవారం మార్కాపురంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల బాబు, సీపీఐ నాయకుడు అందె నాసరయ్య, సీపీఎం నాయకుడు సోమయ్య తదితరులు మాట్లాడుతూ.. భిన్నమతాలు, సంస్కృతులతో ఉన్న భారత దేశంలోని మణిపూర్‌లో చోటుచేసుకుంటున్న సంఘటనలు మానవత్వానికే మచ్చ తెచ్చేలా ఉన్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సికిందర్, రాజు, నన్నెసా, జె.నాగయ్య, చిన్నబాబు, ఎస్.కాలేబు, రోజ్‌లిడియా, భాను, షేక్ ఇస్మాయిల్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలపై శాంతి ర్యాలీ

దర్శి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన హింసాత్మక, అమానవీయ ఘటనలపై దర్శి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్, దర్శి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు, క్రైస్తవులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల అధ్యక్షులు డేవిడ్ ఆర్సన్, బండి మార్కు మాట్లాడుతూ హింసాత్మక ఘటనలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశాన్ని కాపాడిన సైనికుడి భార్యను గోరాతి ఘోరంగా నగ్నంగా ఊరేగించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మతోన్మాద శక్తులు పేట్రేగిపోతున్నారని, క్రైస్తవుల మనుగడ కష్టంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు గాలిమూటి దేవప్రసాద్, కేసనపల్లి నాగేశ్వరరావు, జీ ఏసుదాసు, బెజవాడ అనిల్, ఏసుబాబు, జీఎస్ పాల్, డానియేల్‌పాల్, జీ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.


దొనకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు

మణిపూర్ హింసాత్మక ఘటనకు నిరసనగా ర్యాలీ

దొనకొండ: మణిపూర్‌లో దళిత క్రిస్టియన్లపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలను ఖండిస్తూ సోమవారం సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అక్కడి దళితులపై మతోన్మాదులు రెచ్చిపోయి 367 చర్చీలను ధ్వంసం చేసి స్త్రీలపై అత్యాచారాలు చేసి అడ్డువచ్చిన వారిని చంపారని, నిందితులను శిక్షించాలని కోరారు. దళిత క్రైస్తవులకు రక్షణ కల్పించి మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు జడ్జి ద్వారా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిరుపల్లి అంజయ్య, కుందుర్తి చిన్న నరసింహులు, కోలా కిరణ్‌కుమార్, అంజిబాబు, అంకయ్య, దావీదు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ పెంచాలి


జగనన్న పాలవెల్లువపై సమీక్షిస్తున్న అధికారులు

కురిచేడు: జగనన్న పాలవెల్లువ కేంద్రాల ద్వారా పాలసేకరణ పెంచాలని ఎంపీడీఓ వసంతరావు నాయక్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, పశువైద్య సహాయకులు, వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు కేంద్రాల కన్నా జగనన్న పాలవెల్లువ కేంద్రాల్లో పాల ధర కూడా ఎక్కువగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మండలాన్ని మొదటిస్థానంలో నిలిపేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏపీఎం సైమన్, పంచాయతీ కార్యదర్శులు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఐవీరెడ్డి పరామర్శ


మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐవీరెడ్డి

కొమరోలు: మండలంలోని ఇడమకల్లు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ షేక్ ఖాశింపీరా కుటుంబాన్ని గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త ఐవీరెడ్డి సోమవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ షేక్ ఖాశింపీరా ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఐవీరెడ్డి యూఎస్‌ఏ నుంచి వచ్చిన వెంటనే ఇడమకల్లు గ్రామానికి చేరుకుని ఖాశింపీరా ఇంటికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి, నాగూర్‌బాషా, వెంకటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అసత్యాలు మాని.. ఆధారాలుంటే నిరూపించు

- ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదు.. నిజాలు తెలుసుకో..
- టీడీపీ జమానాలో కమీషన్లు మింగిన ఘనుడు 'కందుల'
- నారా లోకేష్ ఆరోపణలను ఖండించిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల


మాట్లాడుతున్న ఉడుముల శ్రీనివాసులురెడ్డి

పొదిలి రూరల్: యువగళం బహిరంగ సభలో నారా లోకేష్ చేసిన ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలని కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి సవాల్ చేశారు. సోమవారం పొదిలి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నారా లోకేష్ ఆరోపణలను ఖండించారు. ఉడుముల మాట్లాడుతూ.. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదవకుండా నిజాలు తెలుసుకుని మాట్లాడాలని లోకేష్‌కు హితవు పలికారు. తాను గానీ, ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిగానీ ఎక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమించామో, ఎవరి దగ్గర టాక్స్ వసూల్ చేశామో దమ్ముంటే నిరూపించాలన్నారు. కేపీ, ఉడుముల కుటుంబాలు సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్నాయని, అసత్య ఆరోపణలు చేసినంత మాత్రాన తమను దెబ్బతీయవచ్చనుకోవడం భ్రమేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పనుల్లో కమీషన్లు వసూల్ చేసిన ఘనుడు కందుల నారాయణరెడ్డి అని ధ్వజమెత్తారు. ఉడుముల ఆస్పత్రి ఏర్పాటు చేసిన స్థలం 1980లో గాంధీ అనే వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ అయి ఉందని, దానిని 2013లో వెలిశెట్టి వెంకటేశ్వర్లు కొనుగోలు చేశారని, 2015లో తాము కొనే సమయానికే అక్కడ బిల్డింగ్ ఉందని, అందులో హీరో షోరూం, ఫర్నిచర్ షాపులు ఉన్నాయని స్పష్టం చేశారు. పొదిలి ప్రాంత ప్రజలకు మెరుగైనా వైద్య సేవలు అందించడానికి ఆస్పత్రి నిర్మిస్తే.. ఓర్వలేనితనంతో నిరాధారమైన ఆరోపణ చేయడం సరికాదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రాజీవ్‌పల్లె బాటలో భాగంగా కొనకనమిట్ల మండలంలో 100 కిలోమీటర్ల మేర తారురోడ్లు నిర్మిస్తే.. టీడీపీ జమానాలో తువ్వపాడు నుంచి కొత్తపల్లి వరకు మాత్రమే రోడ్డు వేశారని గుర్తుచేశారు. సమావేశంలో ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ ఏడుకొండలు, పార్టీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరెడ్డి, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తుమ్మలచెరువులో చిన్న షరిగత్


తుమ్మలచెరువులో విద్యుద్దీపాలంకరణలో పీర్ల మఖానం

తర్లుపాడు: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పీర్లపండుగకు ప్రసిద్ధిగాంచిన తుమ్మలచెరువు గ్రామంలో మంగళవారం చిన్న షరిగత్ నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. పీర్ల పండుగకు రెండు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షాజహాన్ రోడ్లకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించారు. గ్రామంలో వీధులన్నీ శుభ్రం చేయించారు. పీర్ల గుండం తవ్వించారు. మంగళవారం సాయంత్రం నుంచి పీర్ల గుండం ప్రారంభమవుతుంది. పెద్దఎత్తున గుండంలో నుంచి మంటలు ఎగిసిపడే సమయంలో భక్తులు పీర్లను ఎత్తుకుని అటు ఇటు తిరిగి గ్రామంలో ఊరేగిస్తారు. ఇప్పటికే గ్రామంలో ఇళ్లన్నీ బంధువుల రాకతో కళకళలాడుతున్నాయి.


మఖానంలో కొలువైన పీర్లు

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: మండలంలోని రైతులు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది పండ్లతోటలు పెంచేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ నాగప్రసాదు కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, 5 ఎకరాలలోపు సాగుభూమి గల రైతులు, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన వారు, బోరుబావి కలిగి విద్యుత్ సరఫరా ఉన్న వారు అర్హులని తెలిపారు. రైతులు వారి దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం జెరాక్సు, బ్యాంక్ ఖాతా పుస్తకం జెరాక్సు, ఆధార్‌కార్డు జెరాక్సు, ఉపాధి హామీ జాబ్‌కార్డు జెరాక్సు, పాన్‌కార్డు జెరాక్సు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు 3, గ్రామ పంచాయతీ తీర్మానం తీసుకుని ఈ నెల 31వ తేదీలోపు గ్రామ పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకుడు, ఏపీఓలలో ఎవరికైనా అందజేయవచ్చని తెలిపారు. ఈ పథకం ద్వారా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బత్తాయి, అల్లనేరేడు తోటలు పెంచవచ్చన్నారు. తోటలు సాగుచేసే రైతులకు గుంతలు తీసేందుకు, మొక్కలు నాటడానికి, మొక్కకు ఊత కర్ర కట్టడానికి, మొక్క కొనుగోలుకు, ఎరువులు వేయడానికి, నెల నెలా పర్యవేక్షణకు మూడు సంవత్సరాలపాటు ఉపాధి హామీ పథకం నుంచి డబ్బు చెల్లిస్తారని ఆయన తెలిపారు. ఉద్యానవనశాఖ ద్వారా మైక్రో ఇరిగేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.